సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

సోమవారం । 2 । అక్టోబర్ । 2023



స్పందన రద్దు

పుట్టపర్తిలోని కలెక్టరేట్‌లో, పోలీసు కార్యాలయంలో సోమవారం జరగాల్సిన 'స్పందన' కార్యక్రమం రద్దు చేశారు.



టమాట కిలో రూ.10

కక్కలపల్లి మండీలో ఆదివారం టమాట కిలో ధర గరిష్టం రూ.10, కనిష్టం రూ.3.50, సరాసరి రూ.6.50 చొప్పున పలికింది.

గరిష్టం/కనిష్టం
35.4°/21.8°

జిల్లాలో ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి. పంటలకు జీవం పోసినట్లయింది.

న్యూస్‌రీల్

టీబీ డ్యాంలో తగ్గిన నీటి నిల్వ



తుంగభద్ర జలాశయం

బొమ్మనహాళ్: కర్ణాటక రాష్ట్రం హొస్పేట్ వద్ద ఉన్న తుంగభద్ర జలాశయంలో ఆదివారం నీటి నిల్వ 55.737 టీఎంసీలకు తగ్గింది. నెల రోజుల క్రితం 79 టీఎంసీల నీరు ఉండేది. జలాశయం ఎగువ భాగంలో వర్షాలు తగ్గడం, ఎండల కారణంగా నీటి చేరిక తగ్గిపోయింది. కాలువలకు నీటిని వదులుతుండడంతో మూడు రోజులకు 2 టీఎంసీల చొప్పున నీరు ఖాళీ అవుతోంది. డ్యాంలో ఆదివారం ఇన్‌ఫ్లో 1,220 క్యూసెక్కులు మాత్రమే ఉండగా, అవుట్‌ఫ్లో 9,791 క్యూసెక్కులు నమోదైంది. ఆంధ్రా సరిహద్దులో (105వ కిలోమీటర్ వద్ద) 1,670 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొన సాగుతోంది. గతేడాది ఇదే సమయానికి 1,632.71 అడుగులతో 104.624 టీఎంసీల నీరు నిల్వ ఉండి 42,089 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 55,320 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉండేది.

నేడు రొళ్ల మండలలో సీఎస్ పర్యటన

- ప్రకృతి సాగును పరిశీలించనున్న జవహర్‌రెడ్డి

రొళ్ల: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) జవహర్ రెడ్డి సోమవారం మండలంలో పర్యటించనున్నారు. రొళ్ల మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన రైతులు నాగరాజు, హనుమంతరాయ, కరియమ్మలు ప్రకృతి వ్యవ సాయంలో సాగు చేస్తున్న పలు పంటలను ఆయన పరిశీలించనున్నారు. మండలంలోని ఆర్.వడ్రహట్టి గ్రామ సమీపాన తమకున్న ఏడు ఎకరాల్లో ఈ రైతులు అలసంద, కంది, సజ్జ, గోరు చిక్కుడు, అనప, ఆముదం వంటి పంటలను జెడ్‌బీఎన్‌ఎఫ్(జీరో బేస్డ్ నేచురల్ ఫార్మింగ్) పద్ధతిలో సాగు చేస్తున్నారు. పంటలు ప్రస్తుతం కళకళలాడుతున్నాయి. ప్రతి రైతు కూడా ఇలా చేసుకోవడం వల్ల ఖర్చు తగ్గడంతో పాటు పంటలు బాగా ఉండి, అధిక దిగుబడి రావడంతో పాటు వాటిని వినియోగించడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఉందని సాగు రైతులు తెలిపారు.

పింఛన్ల పంపిణీ ప్రారంభం



అనంతపురం ఆస్పత్రిలో లబ్ధిదారుకు పింఛన్ అందజేస్తున్న డి.చెర్లోపల్లి వలంటీర్ చిన్నపెద్దన్న

పుట్టపర్తి అర్బన్: 'వైఎస్సార్ పింఛన్ కానుక'లో భాగంగా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ జిల్లాలో ఆదివారం తెల్లవారుజాము నుంచే ప్రారంభమైంది. సెలవురోజు అయినా వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి డబ్బు అందజేశారు. జిల్లాలోని 32 మండలాల్లో మొదటి రోజు 2,04,676 మందికి రూ.56,87,22,500 నగదు పంపిణీ చేశారు.

ప్రయాస లేకుండా ప్రభుత్వ సేవ!



చిత్రంలో కనిపిస్తున్న వృద్ధురాలి పేరు సావిత్రమ్మ. తాడిమర్రి మండలం మరువపల్లి వాసి. ఎన్నో ఏళ్లుగా థైరాయిడ్ సమస్యతో బాధపడుతోంది. గతంలో ధర్మవరం ఆస్పత్రికి వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేయించుకునేది. ప్రస్తుతం గ్రామంలోనే బీపీ, షుగర్, థైరాయిడ్ పరీక్షలు చేయించుకుంటోంది. దూర ప్రాంతాలకు వెళ్లే పని లేకుండా స్థానికంగా వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని వృద్ధురాలు హర్షం వ్యక్తం చేసింది.



ఇక్కడ కనిపిస్తున్న యువకుడి పేరు శశి కుమార్. మడకశిర మండలం కేతేపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి. ఉన్న ఊరిలోని సచివాలయంలో పైసా ఖర్చు లేకుండా రేషన్ కార్డు పొందాడు. గతంలో ఏదైనా సమస్య ఉంటే గ్రామస్తులు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న మడకశిర వెళ్లాల్సి వచ్చేది. సచివాలయ వ్యవస్థ అందుబాటులోకి వచ్చిన తర్వాత ఒక్క దరఖాస్తు ఇవ్వగానే.. అనతి కాలంలోనే సమస్యలు పరిష్కారం అవుతున్నాయని శశికుమార్ తెలిపాడు.

గ్రామ స్వరాజ్యం.. సాకారం

- ఉన్న ప్రాంతంలోనే ప్రజలకు అన్ని రకాల సేవలు
- సచివాలయాలు, ఆర్‌బీకేలతో తగ్గిన వ్యయప్రయాసలు
- ఆరోగ్యానికి భరోసా ఇస్తోన్న 'ఫ్యామిలీ డాక్టర్' విధానం
- సీఎం జగన్ చర్యలు చరిత్రాత్మకమంటున్న ప్రజలు

సాక్షి, పుట్టపర్తి:

దశాబ్దాల క్రితం గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం రాష్ట్రంలో సాకారమైంది. పల్లెల్లో ప్రజల మధ్యనే పరిపాలన సాగుతోంది. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో స్థానికంగానే సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఆరోగ్యంపై ప్రజలకు ప్రభుత్వం భరోసా కల్పించింది. తాజాగా 'జగనన్న ఆరోగ్య సురక్ష'తో మరింత సేవ చేసేందుకు సిద్ధమైంది.

ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు

ప్రభుత్వ సేవలన్నీ ప్రజల వద్దకే వస్తున్నాయి. ఒకటో తారీఖు ఉదయాన్నే ఇంటి వద్దకే వచ్చి పింఛన్ అందజేస్తున్నారు. ప్రభుత్వం తరఫున అందాల్సిన ప్రతి ఫలం నేరుగా బ్యాంకు ఖాతాలో చేరుతోంది. పల్లె నుంచి పట్టణం వైపు కన్నెత్తి చూడాల్సిన పని లేకుండా పోయింది. అన్ని రకాల మౌలిక వసతులతో కూడిన ప్రభుత్వ భవనాలు అందుబాటులోకి రావడంతో విద్య, వైద్యం, రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ తదితర సేవలన్నీ తక్షణమే స్వగ్రామంలోనే అందుతున్నాయి. రేషన్ దుకాణాల దగ్గర వేచి ఉండాల్సిన పని లేదు. ఇంటి వద్దకే రేషన్ సరుకులు వస్తున్నాయి. గతంలో స్థానికంగా ఉపాధి లేక ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు కూడా తిరిగి వచ్చేశారు. గ్రామాల్లో పొలాలన్నీ సస్యశ్యామలంగా మారాయి. ప్రజలందరూ సంతోషంగా ఉన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు చరిత్రాత్మకమని కొనియాడుతున్నారు.



మడకశిర మండలం బుళ్లసముద్రం సచివాలయంలో సేవల కోసం వచ్చిన ప్రజలు

ఉన్న ఊరిలోనే వైద్య సేవలు



ఆస్పత్రికి వెళ్లాలంటే గతంలో బత్తలపల్లి లేదా ధర్మవరం వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మా ఊరిలోనే వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఫ్యామిలీ డాక్టర్ విధానం బాగుంది. వైద్యులు ఇంటికి వచ్చి ఆరోగ్య పరీక్షలు చేసి మందులు ఇస్తున్నారు. వృద్ధులకు సీఎం వైఎస్ జగన్ అండగా నిలిచాడు. కలకాలం జగన్ పాలనే ఉండాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నా.

– గాండ్లపర్తి వన్నూర్‌రెడ్డి, మరువపల్లి, తాడిమర్రి మండలం

వ్యయ ప్రయాసలు తగ్గాయి



నాకు నాలుగు ఎకరాల పొలం ఉంది. గతంలో పంటలకు ఎరువు మందులు కావాలంటే మండల కేంద్రానికి వెళ్లి.. అక్కడి నుంచి ప్రైవేటు వాహనాల ద్వారా సరుకు ఇంటికి చేర్చుకోవాల్సి వచ్చేది. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు చేపట్టాక రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి స్థానికంగానే ఎరువులు, విత్తనాలు అందజేసేలా చర్యలు తీసుకున్నారు. దీంతో సమయం ఆదా కావడంతో పాటు రవాణా ఖర్చులు తగ్గిపోయాయి.

– పి.శంకర్, సానేవారిపల్లి, నల్లచెరువు మండలం

సాఫ్ట్‌బాల్ సీనియర్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

అనంతపురం: నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో ఈ నెల 16, 17, 18 తేదీల్లో జరిగే సీనియర్ సాఫ్ట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా పురుషుల, మహిళల జట్ల ఎంపిక ప్రక్రియ ఆదివారం ముగిసింది. అనంత క్రీడాగ్రామం వేదికగా సాగిన ఈ ప్రక్రియకు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికలను ఏపీ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సీఈఓ వెంకటేశులు పర్యవేక్షించారు. మహిళల జట్టుకు టి.లక్ష్మి, బి.లావణ్య, వి.సాయి రిషిత, డి.హంసనయన, పి.స్రవంతి, టి.ధరణి, ఎస్.బ్యూలా, ఎం.కీర్తన, ఎం.దీక్షిత, జి.నాగప్రసన్న లక్ష్మి, వై.ఖ్యాతి కల్యాణి, డి.అమీదాబీ, బి.శిరీష, కె.కల్పన, బి.గౌరీప్రియ, ఎస్.మధులత, జి.కీర్తన ఎంపికయ్యారు. అలాగే పురుషుల జట్టులో బి.మహేష్, ఎం.శివకుమార్, ఈ.వరుణ్‌కుమార్, బి.పృథ్వీరాజ్, పి.అశోక్ కుమార్, కె.లోకేష్, బి.వినోద్, సి.లక్ష్మీనారాయణ, ఎస్.లక్ష్మీకళ్యాణ్, బి.షాకీర్, ఎల్.సింహాద్రి, ఎ.పవన్‌కుమార్, కె.సాయివెంకట్, జి.అరవిందరెడ్డి,ఎం.సి.రంజిత్‌కుమార్ , ఎం.ధనుష్, బి.అక్షయ్‌సాగర్ చోటు దక్కించుకున్నారు. కార్యక్రమంలో నాగేంద్ర, రామకృష్ణ, ప్రభాకర్, గోపాలరెడ్డి, లతాదేవి, ఫక్కీరప్ప, రమేష్, చంద్ర, సాయి దీక్షిత్ తదితరులున్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ నిర్మిద్దాం



శ్రమదానం చేస్తున్న ఇన్‌చార్జ్ జేసీ కార్తీక్, జిల్లా అధికారులు

- ఇన్‌చార్జ్ జేసీ కార్తీక్

పుట్టపర్తి అర్బన్: ప్రజలందరి సహకారంతోనే రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడం సాధ్యమవుతుందని ఇన్‌చార్జ్ జేసీ కార్తీక్ తెలిపారు. 'స్వచ్ఛతా హి సేవ'లో భాగంగా ఆదివారం పుట్టపర్తి సమీపంలోని చిత్రావతి పరివాహక ప్రాంతం, బైపాస్ రోడ్డు వెంబడి 'ఏక్ దిన్ ఏక్ గంట' శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జ్ జేసీ కార్తీక్, డీఆర్‌ఓ కొండయ్య, పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ చైర్మన్ మాతంగి తిప్పన్న, కమిషనర్ మధుసూదనరెడ్డి, జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి ఉదయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. చెత్త ఊడ్చి పిచ్చి మొక్కలు తొలగించారు. అంతకు ముందు పట్టణంలోని ప్రధాన వీధిలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ జేసీ కార్తీక్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజం ఆవిష్కృతమయ్యేలా అధికారులు, ప్రజలు సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ కార్యాలయాలు, వైద్య శాలలు, ప్రైవేటు సంస్థల పరిసరాల్లో ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిశుభ్ర భారతావనిని సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని, ఇందులో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. కాగా, జిల్లా స్థాయి అధికారులంతా చీపుర్లు పట్టి చెత్త ఊడుస్తుండడం చూసి పలువురు పట్టణ వాసులు సైతం చేయి కలిపారు. కాలువ పూడిక తీత పనుల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో డీపీఎంఓ కుల్లాయప్పనాయక్, అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

జనం మద్దతు జగన్‌కే

- సీఎం ప్రవేశపెట్టిన పథకాలను ఇంటింటికీ వెళ్లి చెబుదాం
- టీడీపీ విష ప్రచారాన్ని తిప్పి కొడదాం
- బాబు అవినీతి ప్రజలకు తెలియజేద్దాం
- జేసీఎస్ రీజనల్ కోఆర్డినేటర్ చల్లా మధుసూదన్‌రెడ్డి పిలుపు



మాట్లాడుతున్న జేసీఎస్ రీజనల్ కో ఆర్డినేటర్ చల్లా మధుసూదన్‌రెడ్డి, చిత్రంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు శంకరనారాయణ, ఎమ్మెల్యే సిద్దారెడ్డి, పార్టీ హిందూపురం సమన్వయకర్త దీపిక

కదిరి: 'ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు తెలియజేద్దాం. మరోసారి జగనన్నను ఆశీర్వదించాలని కోరుదాం. జనం మద్దతు జగన్‌కే అని నిరూపిద్దాం' అని జేసీఎస్ రీజనల్ కోఆర్డినేటర్ చల్లా మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక దత్తా గార్డెన్స్‌లో ఆదివారం శ్రీ సత్యసాయి జిల్లా వైఎస్సార్‌సీపీ జేసీఎస్ మండల కోఆర్డినేటర్ల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ చంద్రబాబు గతంలో ప్రజలకిచ్చిన హామీల్లో ఒక్కటీ సక్రమంగా అమలు చేయలేదని దుయ్యబట్టారు. ఎల్లో మీడియా సాయంతో మళ్లీ అబద్ధపు హామీలతో మోసగించాలని చూస్తున్నాన్నారని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ కుట్రలను ప్రజలకు అర్థమయ్యేలా వివరిద్దామన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు సార్వత్రిక ఎన్నికలు పూర్తయ్యే వరకూ సైనికుల్లా పని చేయాలని కోరారు. అన్ని నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. చంద్రబాబు ప్రజాధనాన్ని దోపిడీ చేసి జైలుకెళ్లారనే విషయాన్ని ప్రజలకు తెలియజెప్పడంతో పాటు ఎల్లో మీడియా దుష్ప్రచారాన్ని తిప్పికొడదామని పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ పేదలపక్షం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగన్‌ను మరోసారి ఎందుకు ఎన్నుకోవాలంటే..' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 8 నుంచి ఇంటింటికీ వెళ్లేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ పిలుపునిచ్చారు. నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు, నా మైనార్టీలు అని ముఖ్యమంత్రి పదే పదే తపిస్తున్నారని, రానున్న ఎన్నికలు పెత్తందార్లకు, పేదలకు మధ్య జరుగుతున్నాయని, పేదల పక్షాన నిలిచిన జగనన్నను అందరూ ఆశీర్వదించాలని ఆయన కోరారు.

సంక్షేమంతో పాటు అభివృద్ధి

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి సీఎం జగన్ పాలన సాగిస్తున్నారని కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి తెలిపారు. నాడు–నేడు ద్వారా ఆసుపత్రులు, పాఠశాల భవనాల రూపురేఖలే మారిపోయాయన్నారు. సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం ఇవన్నీ అభివృద్ధి కాదా? అని ప్రశ్నించారు. చంద్రబాబుకు చెప్పుకోవడానికి ఒక్క పథకం కూడా లేదని, దోచుకోవడం–దాచుకోవడమే ఆయనకు తెలిసిన విద్య అని విమర్శించారు. అందుకే న్యాయస్థానం ఆయనకు జైలుశిక్ష విధించిందని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త దీపికారెడ్డి మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేనన్ని సంక్షేమ పథకాలు ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ప్రజకిచ్చిన హామీలు జగనన్న దాదాపుగా నెరవేర్చారన్నారు. పిల్లనిచ్చిన మామనే చంద్రబాబు వెన్నుపోటు పొడిచి ఆయన కుర్చీని, పార్టీని లాక్కొని చావుకు కారణమయ్యాడని, ఇప్పుడు ఆ పాపం పండి జైలుకెళ్లారని ధ్వజమెత్తారు. జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ మారుతిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతి కార్యకర్త వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల జేసీఎస్ మండల కోఆర్డినేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



హాజరైన జేసీఎస్ మండల కో ఆర్డినేటర్లు, పార్టీ నాయకులు

సాయి మార్గమే సన్మార్గం

ప్రశాంతి నిలయం: సత్యం,ధర్మం,శాంతి, ప్రేమలు కలగలిపి మానవాళికి సత్యసాయి సన్మార్గ బోధన చేశారని బాలవికాస్ చిన్నారులు, సత్యసాయి యూత్ తమ నాటిక ద్వారా తెలియజేశారు. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన పార్వతీపురం మన్యం సత్యసాయి భక్తులు ఆదివారం సాయంత్రం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. 'సాయి బాట–రాచ బాట' పేరున సాగిన నృత్య నాటిక అలరించింది. సత్యసాయి బాల వికాస్ విద్యావిధానం ద్వారా సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, క్రమశిక్షణను నేర్పుతూ బంగారు భవిష్యత్తును అందిస్తున్న తీరును చక్కగా వివరించారు. సత్యసాయి వేషధారణలో ఓ విద్యార్థి ఆకట్టుకున్నాడు. అనంతరం కళాకారులు సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు నేతాజీ నాయుడు తమ జిల్లాలో జరుగుతున్న సత్యసాయి సేవలను వివరించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో వ్రతాలు ఆచరించారు.



నాటికలో ఓ ఘట్టం



నృత్యంతో అలరిస్తున్న విద్యార్థులు



సత్యసాయి వేషధారణలో ఆకట్టుకున్న చిన్నారి

మంచి వారని.. నిండా ముంచి

- ముస్లిం దంపతులకు రూ.8 లక్షలకు కుచ్చుటోపీ
- దుబాయ్ కరెన్సీ పేరుతో బురిడీ



మోసపోయిన దంపతులు మజాహర్ అహ్మద్, ఫరీదా





మోసగాడు సలీం, వెంట వచ్చిన మహిళ

బత్తలపల్లి: దుబాయ్ కరెన్సీ పేరుతో ముస్లిం దంపతులను బురిడీ కొట్టించాడో ఘనుడు. రూ. 8 లక్షలకు కుచ్చుటోపీ పెట్టాడు. బత్తలపల్లిలో ఆదివారం ఈ ఘటన చోటు చేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం పాతూరులోని తాడిపత్రి బస్టాండ్ వద్ద మజాహర్ అహ్మద్ చెప్పుల దుకాణంతో పాటు కూల్ డ్రింక్ షాపు నిర్వహిస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం సలీం అనే వ్యక్తి షాపు వద్దకు వచ్చి కూల్ డ్రింక్ తాగాడు. తనది బిహార్ రాష్ట్రమని, పెయింటింగ్ పని చేసుకుంటూ జీవిస్తున్నానంటూ మాటలు కలిపాడు. తన వద్ద దుబాయ్ కరెన్సీ ఉందని, మీరు మంచివారుగా ఉన్నారు అందుకే రూ. 16 లక్షల విలువ చేసే కరెన్సీని రూ.8 లక్షలకే ఇస్తానని ఆశ చూపాడు. నోట్లు ఇవ్వండి పరీక్షించుకుంటానని మజాహర్ అహ్మద్ కోరగా, సలీం ఆయనకు ఓ నోటు ఇచ్చాడు. తెలిసిన వ్యక్తి బెంగళూరులో ఉండడంతో మజాహర్ ఆయనను సంప్రదించాడు. సదరు నోటు భారత కరెన్సీ ప్రకారం రూ.16 పలుకుతుందని ఆయన తెలిపాడు. దుబాయ్ కరెన్సీ ఎలా వచ్చిందని ప్రశ్నిస్తే.. తాము ముంబైలో ఓ ధనవంతురాలైన వృద్ధురాలి వద్ద పని చేస్తుండగా ఆమె చనిపోయిందని, ఆమె కుమారుడు వారి తల్లికి చేసిన సేవకు గుర్తుగా సదరు కరెన్సీ ఇచ్చినట్లు మజాహర్ తెలిపాడు. ఈ క్రమంలోనే సలీంకు ఫోన్ చేసి దుబాయ్ కరెన్సీ చూపాలని మజాహర్ కోరాడు. బత్తలపల్లికి వస్తే చూపిస్తానని సలీం తెలపగా.. అతను చెప్పినట్టే మూడు రోజుల క్రితం బత్తలపల్లి వచ్చాడు. సలీం అతడిని స్థానికంగా జనసంచారం లేని ప్రదేశానికి తీసుకెళ్లి దుబాయ్ కరెన్సీ చూపాడు. వెంటనే ఎంతో సంతోషంతో అక్కడి నుంచి అనంతపురం చేరుకున్న మజాహర్.. తన వద్ద ఉన్న డబ్బుతో పాటు తెలిసిన వారి నుంచి కొంత అప్పు తీసుకుని మొత్తం రూ. 8 లక్షలు పోగు చేసుకున్నాడు. ఆదివారం తన భార్య ఫరీదాతో కలిసి ద్విచక్రవాహనంలో బత్తలపల్లికి వస్తున్నట్లు సలీంకు సమాచారమివ్వగా, ఎస్టీ కాలనీకి రావాలని ఆయన సూచించాడు. అప్పటికే ఓ మహిళతో కలిసి అక్కడున్న సలీం.. మజాహర్ దంపతులు రాగానే దుబాయ్ కరెన్సీ ఇందులో ఉందని చెప్పి ఓ మూట వారికి అందజేశాడు. కొద్ది దూరం నడుచుకుంటూ వెళ్లి ద్విచక్రవాహనంలో ఉడాయించాడు. వారు వెళ్లిన కొద్ది సేపటికి బ్యాగు తెరిచి చూస్తే అందులో పాత న్యూస్ పేపర్లు కనపించాయి. దీంతో హతాశులైన దంపతులు లబోదిబోమంటూ బత్తలపల్లి పోలీస్ స్టేషన్ చేరుకున్నారు. తాము ఎలా మోస పోయిందీ వివరించారు. మూట ఇస్తున్న సమయంలో అవతలివారికి తెలియకుండా చిత్రించిన వీడియో చూపించారు. అయితే, ఇదంతా జరిగింది అనంతపురంలో కనుక అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేయాలని వారు చెప్పారని, అనంతపురం వెళ్తే జరిగింది బత్తలపల్లిలో కాబట్టి అక్కడికే వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేయాలని చెప్పినట్లు బాధితులు వాపోయారు. తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా, సలీంకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారి ముఠా కాపు కాసినట్లు తెలిసింది. దాదాపు ఏడు మంది మరో వ్యాన్‌లో పర్యవేక్షించినట్లు సమాచారం.

క్లుప్తంగా

● మహాత్ముని స్ఫూర్తి


గాంధీజీ వేషధారణలో తిరుపతయ్య

అనంతపురం కల్చరల్: మహాత్ముడి వేషధారణలో కనిపిస్తున్న ఈయన పేరు తిరుపతయ్య. పుట్టి పెరిగింది ప్రకాశం జిల్లా అయినా బీఎస్ఎన్ఎల్‌లో ఉద్యోగ అవకాశం దక్కడంతో 1987లో అనంత జిల్లాకు వచ్చి గార్లదిన్నెలో స్థిర నివాసమేర్పరుచుకున్నారు. ఆధునిక పోకడలు, యాంత్రిక జీవనంలో దేశభక్తులను నేటి తరం మరుస్తోందని గుర్తించిన ఆయన అంతరించి పోతున్న విలువలకు గాంధీజీ వేషధారణలో పునర్జీవం పోసే చర్యలు చేపట్టారు. 2021 నుంచి ఆయన ఉమ్మడి తెలుగు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ గాంధీజీ వేషధారణలో ఆకట్టుకున్నారు. పాత తరం వారి ఆదర్శభావాలు నేటి తరానికి పరిచయం చేయకపోతే రానున్న కాలంలో మానవత్వం నశించి పోయే ప్రమాదముందని చెబుతుండే ఆయన.. గాంధీజీ వేషమే కాకుండా వాల్మీకి, అల్లూరి సీతారామరాజు వేషధారణలతోనూ కనిపిస్తుంటారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచండి : డీఈఓ

కొత్తచెరువు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి, ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓ శివకుమారి పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం కొత్తచెరువులోని మేజర్ పంచాయతీ కార్యాలయం నుంచి నాలుగురోడ్ల కూడలి వరకూ అధికారులు, ప్రజా ప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాలుగురోడ్ల కూడలిని శుభ్ర పరిచారు. సర్పంచ్ రాధ, ఈఓఆర్డీ సిద్ధారెడ్డి, ఎంఇఓ జయచంద్ర, కార్యదర్శి గోపాల్, జేఈ ఓబులేసు, వైఎస్సార్‌సీపీ నాయకులు వాల్మీకి శంకర, పాపన్న, యల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

'అనంత'లో నకిలీ వైద్యులు

- హెల్త్ క్యాంపుల పేరుతో ఉమ్మడి జిల్లా పల్లె వాసులకు బురిడీ
- నగరంలోని పలు ప్రముఖ ఆస్పత్రుల్లో వైద్యులమంటూ టోకరా
- ప్రముఖ కార్డియో సెంటర్‌లో ఐదేళ్ల అనుభవమంటూ బీరాలు
- తాజాగా అనంతలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యానికి టోపీ
- బకాయి వేతనాలు చెల్లించాలంటూ ఎదురు దాడి



అనంతపురం క్రైం: గుండె వైద్య నిపుణులమంటూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే జంట ఒకటి అనంతలో పాగా వేసింది. పల్లె ప్రాంతాల్లో హెల్త్ క్యాంపులు పెట్టి లేని జబ్బు ఉన్నట్లుగా చూపి కాసులు పోగేసుకుంటున్న ఈ నకిలీ వైద్యుల బాగోతం ఇటీవల వెలుగు చూసింది. విజయవాడలోని ఓ ప్రముఖ కార్డియో సెంటర్‌లో ఐదేళ్ల పాటు పనిచేశామంటూ ఏకంగా అనంతపురంలోని ప్రముఖ ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులను సైతం నమ్మించి మోసాలకు తెగబడిన దంపతుల ఉదంతం చివరకు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని, రాజీ వ్యవహారంతో గుట్టుచప్పుడు కాకుండా సద్దుమణిగింది.

వృత్తికి సంబంధంలేని చదువు..

బీకాం పూర్తి చేసిన ఓ యువకుడు, ఇంటర్ వరకూ చదువుకున్న యువతి దంపతులుగా మారి తాము వైద్యులమంటూ అనంతపురంలోని పలు ప్రముఖ ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఇంతకాలం సేవలు అందిస్తూ వచ్చారు. కొద్ది రోజుల క్రితం కోర్టు రోడ్డులో మూతపడిన ఓ ప్రముఖ ప్రైవేట్ ఆస్పత్రిలోనూ వీరు పనిచేశారు. అయితే ఆలస్యంగా వీరు నకిలీలుగా గుర్తించిన ఆస్పత్రి యాజమాన్యం అక్కడి నుంచి వీరిని తరిమేసింది. దీంతో ఆదిమూర్తినగర్‌లోని మరో ప్రముఖ ఆస్పత్రి నిర్వాహకుడిని కలసి తాము విజయవాడలోని ఓ ప్రముఖ కార్డియో సెంటర్‌లో ఐదేళ్లపాటు పనిచేశామని, అక్కడ వేతన విషయంలో గొడవలు తలెత్తడంతో అనంతపురానికి వచ్చినట్లు వివరించి, తమకు అవకాశం కల్పిస్తే ఆస్పత్రి కీర్తిప్రతిష్టలను మరింత పెంచుతామని భరోసానిచ్చారు. వారి మాటలు నమ్మి కలిసి పనిచేసేందుకు ఆస్పత్రి నిర్వాహకులు అంగీకరించారు.

నెలకు రూ.1.50 లక్షల వేతనంతో...

కార్డియాలజిస్ట్‌గా తాను పనిచేయాలంటే నెలకు రూ.1.50 లక్షల వేతనంతో పాటు వైద్య శిబిరాలకు వెళ్లేందుకు కారు, ఇతర ఖర్చులు భరించాలని ఆ యువకుడు కండీషన్ పెట్టాడు. తన భార్య ఫార్మా-డీ (డాక్టర్ ఆఫ్ ఫార్మసీ) చేసిందని, ఆమె కూడా తనతో పాటు క్యాంప్‌లకు వస్తుందని, ఇందుకు గాను ఆమెకు రోజుకు రూ.వెయ్యి చొప్పున ఇవ్వాల్సి ఉంటుందని ఒప్పందం చేసుకుని, ఈ ఏడాది మార్చిలో ఆస్పత్రి నిర్వాహకులం నుంచి మొత్తం రూ.3.50 లక్షలను అడ్వాన్స్‌గా తీసుకుని విధుల్లోకి చేరారు.

తాము పనిచేస్తున్న ఆస్పత్రి తరఫున ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఇప్పటి వరకూ మొత్తం 11 వైద్య శిబిరాలను నకిలీ వైద్య దంపతులు నిర్వహించారు. వజ్రకరూరు మండలం తట్రకల్లు, బత్తలపల్లి మండలం నిడిగల్లు, దాడితోట తదితర గ్రామాల్లో పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 8 మందికి గుండె సంబంధిత జబ్బులున్నాయని, అనంతపురంలో తాము పనిచేస్తున్న ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలంటూ సిఫారసు చేశారు.

జబ్బు లేకున్నా ఉందంటూ..

దీంతో బెంబేలెత్తిన సదరు గ్రామీణులు తమకు తెలిసిన వైద్యుడిని సంప్రదిస్తే అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించిన అనంతరం వారికి ఎలాంటి జబ్బులూ లేవని నిర్ధారించారు. ఈ విషయం తెలుసుకున్న సదరు బాధితులు నేరుగా అనంతపురంలోని ఆదిమూర్తినగర్‌లో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి చేరుకుని నిర్వాహకులను నిలదీశారు. దీంతో అవాక్కయిన ఆస్పత్రి నిర్వాహకులు నకిలీ వైద్య దంపతులను ప్రశ్నించడంతో సమాధానం ఇవ్వకుండా దాటవేసేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో వారి సర్టిఫికెట్లు చూపాలని నిర్వాహకులు డిమాండ్ చేయడంతో తమకు అవమానం జరిగిన చోట ఒక క్షణం కూడా ఉండమంటూ దంపతులు వెళ్లిపోయారు. అనంతరం బకాయి వేతనం చెల్లించాలంటూ వేధింపులకు తెరలేపారు. వేధింపులు తాళలేక చివరకు జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎస్పీకి నేరుగా ఆస్పత్రి నిర్వాహకులు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీస్ స్టేషన్‌కు పిలిపించిన ఓ సీఐ వారికి గట్టిగా వార్నింగ్ ఇచ్చి వదిలేసినట్లు తెలిసింది.

వివాహిత అనుమానాస్పద మృతి


గౌరమ్మ (ఫైల్)

రొద్దం: మండలంలోని పెద్ద కోడిపల్లికి చెందిన బోయ ప్రకాష్ భార్య గౌరమ్మ (28) ఆదివారం అనుమానాస్పదస్థితిలో మృతిచెందింది. ఇంట్లోనే పైకప్పుకు ఉరి వేసుకుని విగత జీవిగా వేలాడుతుండడంతో కుటుంబసభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని బల్లేనహళ్లికి చెందిన గౌరమ్మకు కొన్నేళ్ల క్రితం పెద్దకోడిపల్లికి చెందిన ప్రకాష్‌తో వివాహమైంది. కొంతకాలం సాఫీగా సాగినా... ఆ తర్వాత భార్యపై అనుమానంతో భర్త వేధిస్తూ వచ్చేవాడు. మానసికంగా, శారీరకంగా ఆమెను కొట్టి హింసిస్తుండడంతో గత నెల 2న రొద్దం పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. ఆ సమయంలో దంపతుల మధ్య పంచాయితీ నిర్వహించి రాజీ చేసి ఇంటికి పంపారు. ఈ నేపథ్యంలో ఇంట్లోనే ఆమె ఉరి వేసుకుని మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబసభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేశారు. గౌరమ్మ శరీరంపై గాయాలు ఉండడంతో హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని, లేకపోతే భర్త, ఆయన కుటుంబసభ్యులు ఎందుకు పరారవుతారని పోలీసులను ప్రశ్నించారు. దీంతో బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ప్రకాష్, ఆయన కుటుంబసభ్యులు లక్ష్మీదేవి, అంజినమ్మ, భాగ్యమ్మ, నాగమునిస్వామి, భార్గవపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సీఆర్పీ పోస్టులకు ఫేక్ సర్టిఫికెట్లు?

- ఆన్‌లైన్‌లో ఇష్టానుసారంగా మార్కుల నమోదు
- ఐఈఆర్పీ సర్వీసు లేకపోయినా ఉన్నట్లుగా చూపిన ఘనులు
- ఆర్‌సీఐ గడువు ముగిసిన పత్రాలతోనూ దరఖాస్తు
- నకిలీవిగా తేలితే క్రిమినల్ కేసు నమోదుకు చర్యలు

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్ర శిక్ష సహిత విద్య విభాగంలో ఖాళీగా ఉన్న ఐఈఆర్పీ పోస్టుల భర్తీల్లో కొందరు ఫేక్ సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. పరిశీలనలో తేలితే తప్పుకుందాం... లేదంటే ఉద్యోగం వస్తుందనే దురాలోచనతో ఈ అక్రమ మార్గాన్ని ఎంచుకున్నట్లుగా తెలుస్తోంది. ప్రధానంగా స్పెషల్ బీఈడీ, డీఈడీ కోర్సులకు సంబంధించి నకిలీ సర్టిఫికెట్లను జత చేసినట్లు విశ్వసనీయ సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న సీఆర్పీ పోస్టుల భర్తీకి సంబంధించి గతంలో ఆన్‌లైన్ ద్వారా సమగ్ర శిక్ష ఉన్నత స్థాయి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. ఇందులో ఉమ్మడి అనంత జిల్లా వ్యాప్తంగా 42 పోస్టులను భర్తీ చేయనున్నారు. దరఖాస్తు ప్రక్రియలో కొందరు అక్రమార్కులు నిబంధనలు తుంగలో తొక్కి ఇష్టానుసారంగా మార్కులు నమోదు చేసి అప్‌లోడ్ చేశారు. స్పెషల్ ఎడ్యుకేషన్‌తో పాటు రిహాబిలిటేషన్ కౌన్సెల్ ఆఫ్ ఇండియా (ఆర్‌సీఐ) నుంచి సర్టిఫికెట్ లైవ్‌లో లేకున్నా పాత వాటితోనే దరఖాస్తు చేసినట్లుగా తెలుస్తోంది. మరోవైపు గతంలో ఐఈఆర్పీగా పని చేయని వారు సైతం ఈ కేటగిరి కింద దరఖాస్తు చేస్తూ సర్వీస్ పాయింట్లను నమోదు చేశారు. రేపటి (మంగళవారం) నుంచి రెండు రోజుల పాటు సమగ్రశిక్ష ఏపీసీ కార్యాలయంలో అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన జరగనుంది. ఈ నేపథ్యంలో కొందరు అభ్యర్థులు దరఖాస్తు సమయంలో చేసిన అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. పరిశీలన అధికారులు గుర్తిస్తే ఏదో ఒకటి చెబుదాం, దొరక్కపోతే అలాగే ముందుకు వెళ్దామనే ఆలోచనలో అభ్యర్థులు ఉన్నారు.

పరిశీలన పక్కాగా ఉంటుంది



సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ నిపుణుల సమక్షంలో పక్కాగా చేపడుతున్నాం. ఒకటికి రెండుసార్లు జాగ్రత్తగా పరిశీలిస్తారు. అనుమానం వస్తే సంబంధిత కళాశాలలు, యూనివర్సిటీలకు లేఖలు రాసి, వాస్తవాలు రాబట్టుకుంటాం. ఇందులో ఫేక్ సర్టిఫికెట్లు జత చేసినట్లు నిగ్గు తేలితే దరఖాస్తు దారుపై క్రిమినల్ కేసు బనాయిస్తాం.

– వి.నాగరాజు, ఏపీసీ సమగ్రశిక్ష

కర్ణాటక మద్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు, ఆటోతో సెబ్ పోలీసులు

తాడిపత్రి అర్బన్: కర్ణాటకలోని పావగడ నుంచి తాడిపత్రికి తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని సెబ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అందిన ముందస్తు సమాచారంతో అప్రమత్తమైన సెబ్ పోలీసులు ఆదివారం తాడిపత్రి మండలం రావివెంకటాంపల్లి సమీపంలో వాహనాల తనిఖీ చేటప్టారు. ఆ సమయంలో తాడిపత్రి వైపు వస్తున్న ఏపీ02 టిబి 2971 నంబరు గల ఆటోను తనిఖీ చేశారు. అందులో 145 కర్ణాటక మద్యం ప్యాకెట్లు, 8 ఓల్డ్ అడ్మిరల్ లీటర్ బాటిళ్లు పట్టుబడ్డాయి. నిందితుడు గన్నెవారిపల్లికి చెందిన అడవిరెడ్డిని అరెస్టు చేసి మద్యం, ఆటోను సీజ్ చేసినట్లు సెబ్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో వృద్ధుల పాత్ర కీలకం

- ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ కార్తీక్


వృద్ధులను సత్కరిస్తున్న ఇన్‌చార్జ్ జేసీ కార్తీక్

హిందూపురం టౌన్: దేశంలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో వృద్ధులది గణనీయమైన పాత్ర అని ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ కార్తీక్ కొనియాడారు. ఆదివారం అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా హిందూపురం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో క్రమం తప్పకుండా ఓటు హక్కు వినియోగించుకుంటూ వచ్చిన 80 సంవత్సరాలు పైబడిన పలువురిని ఘనంగా సత్కరించి, మాట్లాడారు. 80 ఏళ్ల వయసులోనూ పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకుంటున్న వృద్ధులను స్ఫూర్తిగా తీసుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వర్ణలత, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, కార్యాలయ, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులతోనే ప్రజాస్వామ్యం బలోపేతం : ఆర్డీఓ

ప్రశాంతి నిలయం: ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో వృద్ధుల పాత్ర కీలకమని ఆర్డీఓ భాగ్యరేఖ అన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా క్రమం తప్పకుండా ఓటు హక్కు వినియోగించుకుంటూ వచ్చిన 80 ఏళ్లు పైబడిన వారిని ఎనుములపల్లి 7వ వార్డు సచివాలయం వద్ద ఆమె సత్కరించి, మాట్లాడారు. సమాజంలో పెద్దలను గౌరవించడం అందరూ బాధ్యతగా గుర్తించాలన్నారు. వృద్ధాప్యం ఏ ఒక్కరికీ శాపంగా మారకూడదనే రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాల ద్వారా వారిని ఆదుకుంటోందన్నారు. ప్రతి ఒక్కరూ వృద్ధులకు తగినంత చేయూతనివ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పుట్టపర్తి తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 80 ఏళ్లు పైబడిన ఓటర్లను తహసీల్దార్ నవీన్‌కుమార్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో సందీప్, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


పామిడి సమీపంలో పెన్నానది పక్కనే రైతు తిరుపాలు పొలంలో బోరు నుంచి సమృద్ధిగా వస్తున్న నీరు


పచ్చని పంట పొలాల పక్కనే కనిపిస్తున్న పామిడి గ్రామం

● పెన్నమ్మ పరుగులు.. భూములు మాగాణులు

జిల్లాలోని పామిడి గ్రామ సమీపంలో పెన్నా నదిలో నీరు పారితే సూర్యుడు పడమట ఉదయించినంత అద్భుతంగా పెద్దలు చెబుతుంటారు. మూడు దశాబ్దాల క్రితం ఈ ప్రాంత వాసులు పెన్నా నదిలో నీరు ప్రవహించడం చూశారు. ఆ తర్వాత చూద్దామంటే నీటి చుక్క లేకుండా పోవడంతో పీనుగులను కాల్చే వల్లకాడుగా మారింది. దీంతో పీనుగుల పెన్నాగా పిలిచేవారు. మళ్లీ ఇన్నాళ్లకు పెన్న ప్రవహిస్తోంది. అలాఇలా కాదు.. ఏకంగా జీవనదిలా పాయలుగా మారి ప్రవహిస్తోంది. దీంతో పెన్నా పరివాహక ప్రాంతంలో భూగర్భ జలాలు గణనీయంగా పెరిగాయి. ఈ క్రమంలో ఇంత కాలం బీళ్లుగా పడి ఉన్న భూములు కాస్త మాగాణులయ్యాయి. బోడి కొండలు పచ్చదనం సంతరించుకున్నాయి. ఒకప్పుడు ఏడాదికి రెండు పంటలు తీయడం గగనమైన ప్రాంతంలో ఇప్పుడు ఏకంగా మూడో పంట తీసేందుకు రైతులు పోటీ పడ్డారు. దీంతో ఎటు చూసినా పచ్చని పంట పొలాలు కనువిందు చేస్తున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

యువకుడి దుర్మరణం


నగేష్ (ఫైల్)

మడకశిర రూరల్: కర్ణాటకలో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో మడకశిర మండలానికి చెందిన ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... జక్కేపల్లి గ్రామానికి చెందిన నగేష్(30) బెంగళూరుకు వలస వెళ్లి అక్కడే పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామంలో ఉన్న తన తల్లి తిప్పక్కను పలకరించేందుకు శనివారం రాత్రి బెంగళూరు నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. కర్ణాటకలోని నల్లక్కమనహళ్లి సమీపంలోకి చేరుకోగానే గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న మిడిగేశి పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

వాహనం ఢీ కొని మహిళ మృతి


సుమలత (ఫైల్)

పెద్దవడుగూరు: వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వివాహిత మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... యాడికి మండలం దైవాలమడుగు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత తిరుమలరెడ్డి, డీలర్ సుమలత (48) దంపతులు. ఆదివారం ఉదయం అనంతపురంలోని ఓ కళాశాలలో చదువుకుంటున్న కుమారుడిని పలకరించి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యారు. పెద్దవడుగూరు మండలం అప్పేచర్ల సమీపంలో జాతీయ రహదారిపై ప్రయాణిస్తుండగా వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో సుమలత అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన తిరుమల రెడ్డిని పామిడిలోని సీహెచ్‌సీకి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఎ.కొండాపురంలో వ్యక్తి మృతి

పుట్లూరు: ప్రమాదవశాత్తు కిందపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రిలోని అంబేడ్కర్ కాలనీ నివాసి నాగరంగయ్య(42) పుట్లూరు మండలం సూరేపల్లిలో వివాహం చేసుకున్నాడు. ఈ క్రమంలో సూరేపల్లికి వచ్చిన ఆయన ఆదివారం తిరుగు ప్రయాణమై ఎ.కొండాపురానికి చేరుకున్నాడు. అక్కడ మూర్ఛ రావడంతో కిందపడి గిలగిలా కొట్టుకుంటూ మృతి చెందాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

గుట్కా స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గుట్కా బస్తాలు చూపుతున్న పోలీసులు

తాడిపత్రి అర్బన్: అక్రమంగా తరలిస్తున్న గుట్కా బస్తాలను తాడిపత్రి అర్బన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అర్బన్ సీఐ హమీద్‌ఖాన్ తెలిపిన మేరకు... శనివారం అర్ధరాత్రి స్థానిక అశోక్ పిల్లర్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టిన సమయంలో గుంతకల్లు నుంచి తాడిపత్రికి వస్తున్న ఏపీ 02 ఏకే 9853 మారుతీ ఏకో వాహనాన్ని ఆపి పరిశీలించారు. అందులో రూ. 50 వేలు విలువ చేసే గుట్కా బస్తాలను తరలిస్తున్నట్లుగా తెలుసుకుని స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేశారు. గుట్కా తరలిస్తున్న యాదళం సతీష్‌ని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

ప్రమాదంలో అన్నదమ్ములకు గాయాలు

ధర్మవరం రూరల్: ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడిన ఘటనలో అన్నదమ్ములు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు... కనగానపల్లి మండలం భానుకోటకు చెందిన అమరనాథ్, వినోద్‌కుమార్ అన్నదమ్ములు. ఆదివారం ఉదయం పనిపై ధర్మవరం మండలం ఆర్.యర్రగుంటపల్లికి ద్విచక్ర వాహనంపై బయలుదేరిన వారు.. గ్రామ శివారులోకి చేరుకోగానే మలుపు వద్ద వేగాన్ని నియంత్రించుకోలేక అదుపు తప్పి కిందపడ్డారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు వెంటనే ధర్మవరంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు.

సందడిగా అనంత క్రీడాగ్రామం


నేషనల్ ఫుట్‌బాల్ గర్ల్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

అనంతపురం: జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలతో అనంత క్రీడాగ్రామంలో సందడి నెలకొంది. ఆదివారం ఛత్తీస్‌ఘడ్, జమ్ముకశ్మీర్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒక్క గోల్ తేడాతో జమ్ముకశ్మీర్ విజయం సాధించింది. అలాగే లఢక్‌పై తలపడిన మధ్యప్రదేశ్ జట్టు ఏకపక్షంగా 17 గోల్స్ సాధించి ఘన విజయం నమోదు చేసింది. తెలంగాణ, డామన్‌డయ్యూ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 12-0 గోల్స్ తేడాతో తెలంగాణ జట్టు విజయం సాధించింది. పాండిచ్చేరిపై జరిగిన మ్యాచ్‌లో 9-2 గోల్స్ తేడాతో చండీఘడ్ జట్టు విజయం సాధించింది. జాతీయ స్థాయి బాలిక ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక ఈ నెల 5 నుంచి రాజస్థాన్‌లోని జోథ్‌పూర్‌లో ప్రారంభమయ్యే జాతీయ స్థాయి బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర జట్టును అనంత క్రీడాగ్రామం వేదికగా ఆదివారం ఎంపిక చేశారు. మొత్తం 22 మందిని ఎంపిక చేసినట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.వేణుగోపాల్ తెలిపారు.